క్లుప్తంగా

దేవస్థానానికి ఎలక్ట్రికల్ ధమరుకాల వితరణ



ధమరుకాలను పరిశీలిస్తున్న వేదపండితులు రవిశంకర అవధాని

మహానంది: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన సబ్బసాని శివకుమారి, కుటుంబ సభ్యులు మహానంది దేవస్థానానికి రెండు ఎలక్ట్రికల్ ధమరుకాలను విరాళంగా అందించారు. ఈ మేరకు వారు ఆదివారం దేవస్థానానికి చేరుకుని స్థానిక యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధానిని కలిసి వాటిని అందజేశారు. దాతలకు ఆలయ పండితులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి

మహానంది: గ్రామాల్లో గొడవలకు పాల్పడటం, వర్గాల మధ్య రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. గోపవరం గ్రామంలో ఆదివారం కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ అనుమానితుల ఇళ్లల్లో తనిఖీల్లో భాగంగా గ్రామానికి చెందిన ఈడిగ శ్రీనివాసులు ఇంట్లో 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామంలో ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బైకులు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన నాగేశ్వరరావు

మహానంది: బుక్కాపురం గ్రామంలోని పాదుపు భవనం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పంట పొలాల నుంచి వస్తున్న ఓ బైకును తప్పించబోగా ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఒక బైక్‌పై తమ్మడపల్లె గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, మరో బైకుపై నాగేంద్ర వస్తున్నారు. అయితే సమీపంలోని పంట పొలాల నుంచి మరో వ్యక్తి బైకు మీద వస్తుండగా ఆయనను తప్పించబోయిన రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

ఆయుర్వేద ఔషధాలకు ప్రాచుర్యం కల్పించాలి



ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఆయుర్వేద ఔషధాలకు ప్రాచుర్యం కల్పించాలని ప్రముఖ వైద్యుడు కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భారతదేశంలో ఆయుర్వేద వైద్యం ఎక్కువ ప్రాచుర్యం పొందిందన్నారు. వంటింటి పసుపు, మొదలు పెరటి మొక్కల వరకు ఔషధం విలువలు కలిగినవన్నారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు చిన్నపురెడ్డి, సుబ్బయ్య, నాగరాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 38మంది ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో సింక్రియన్ కన్సల్టింగ్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ కమ్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు 38 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్లేస్‌మెంట్ అధికారులు ఈవీఎస్ కుమార్, ఎస్.కుమార్ తెలిపారు. ఆదివారం జరిగిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు 164 మంది విద్యార్థులు హాజరు కాగా మొదటి రౌండ్‌లో 82 మంది అర్హత సాధించి చివరగా 38 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. వార్షిక వేతనం 1.75 లక్షల రూపాయలు కల్పించబడుతుందన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్
- కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం

నందికొట్కూరు: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 17వ వార్డులో పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ కమిటీ సెక్రటరీ షేక్ మహమ్మద్ అబ్దుల్ జఫార్ ఇంటి నుంచి కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం చేపట్టారు. అలాగే మిడుతూరు మండలంలోని తలముడిపి గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్య విద్యను, వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేశారన్నారు. వాటిని తన వారికి అప్పగించేందుకు పీపీపీ విధానాన్ని తీసుకొచ్చిన చంద్రబాబు కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ విధానం రద్దు చేసే వరకు ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. 5 మెడికల్ కళాశాలకు టెండర్లకు పిలవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిర్మాణ దశలో ఉన్నవాటికి అనుమతులు వచ్చిన కూటమి ప్రభుత్వం పూర్తి చేయకుండా కమీషన్ల కోసమే అస్మదీయులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు.రూ.7 వేల కోట్లు ఖర్చు పెడితే పూర్తయ్యే వాటిని ప్రైవేట్‌కు దారదత్తం చేయడం వెనుక కుట్రకోణముందన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, కౌన్సిలర్ నాయబ్, రవూఫ్, మహిళా అధ్యక్షురాలు హసీనా, నాయకులు కోకిల రమణారెడ్డి, గోవిందారెడ్డి, లడ్డు, రాజు, సతీష్‌రెడ్డి, రవి, శ్రీను, విజ్జి, మాధురి, సురేష్‌యాదవ్, సులోచన, మాధురి, బాబు, నూర అహ్మద్, వలి, హస్యం, ఉస్మాన్, గఫూర్, నాగరాజు, రంగారెడ్డి, బన్నీ, మిడుతూరు మండల నాయకులు లోకేష్‌రెడ్డి, శివనాగిరెడ్డి, సర్పంచు వెంకటేశ్వర్లు, అక్బర్‌బాషా, తులసిరెడ్డి పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో పాల్గొన్న దారా సుధీర్



జూపాడుబంగ్లాలో మాట్లాడుతున్న దారా సుధీర్

విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు..

జూపాడుబంగ్లా: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే పుట్టగతులు ఉండవని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ హెచ్చరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం స్థానిక కసానగర్ కాలనీలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో జగనన్న మెడికల్ కళాశాలలను తెస్తే.. వాటిని అస్మదీయులకు అప్పగించాలను ఘనత చంద్రబాబుదని మండిపడ్డారు. ప్రైవేటీకరణ చేస్తే ఫీజులు పెరిగి పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలతో సంతకాలను సేకరించారు జెడ్పీటీసీ పోచా జగదీశ్వర రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక తిరుమలేశ్వర రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి లింగాపురం సర్పంచ్ కేశవరెడ్డి, నాగార్జున రెడ్డి, మండల కన్వీనర్ తోకల కృష్ణరెడ్డి, నాని రెడ్డి, నందికొట్కూరు బీసీ సెల్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, రాధాకృష్ణారెడ్డి, యశ్వంత్ రెడ్డి , మండల ఉపాధ్యక్షుడు చిన్న మల్లయ్య, నాయకులు కోసిక తరుణ్ కుమార్ రెడ్డి, హర్ష వర్ధన్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, దినేష్, సుంకన్న, వెంకటస్వామి, త్యాగరాజు, రామకృష్ణ, కమ్మ గిరి, శివ, మజీద్,ఖాజా, సురేష్, సోషల్ మీడియా మండల కన్వీనర్ మాధవరం కళ్యాణ్ పాల్గొన్నారు.



కోటి సంతకాల ప్రతిని దారా సుధీర్‌కు అందజేస్తున్న రమేష్‌నాయుడు

ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమం

పగిద్యాల: పేద విద్యార్థుల మెడిసిన్ కలను సాకారం చేసేందుకు గతంలో జగనన్న ప్రభుత్వం తెచ్చిన 17 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని విరమించే వరకు ఉద్యమం ఆగదని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్ తెలిపారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి స్వగృహంలో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి 500 సంతకాలను సేకరించి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఏర్పాటైన అనుబంధ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ఉత్తేజపరిచారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నాయకత్వంలో కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు రాబోయే రోజుల్లో మంచి రోజులు రానున్నాయని భరోసా నిచ్చారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి పాలూరు వెంకటేశ్వర్లు, మద్దిలేటి, సర్పంచ్‌లు పెరుమాళ్ల శేషన్న, నాగార్జునరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ శిరిగిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి శివశంకర్‌రెడ్డి, నాగశేనారెడ్డి, మద్దిలేటి, బోయ మధు, ప్రసాదరెడ్డి, రమణప్రసాద్, గుజ్జుల స్వాములు, మేకల రవికుమార్,రసూల్, వర్కర్ ముత్తు పాల్గొన్నారు.

మరింత మంచిపేరు సాధించాలి

నందికొట్కూరు: కానిస్టేబుల్‌గా మంచి పేరు సాధించిన జ్యోతి..ఇప్పుడు ఉపాధ్యాయినిగా మరింత పేరు తెచ్చుకోవాలని రూరల్ సీఐ సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జ్యోతి డీఎస్సీలో ఉపాధ్యాయినిగా ఉద్యోగం సాధించడంతో ఆమెను రూరల్ సీఐ, ఎస్ఐలు తిరుపాలు, ఓబులేసు ఘనంగా సన్మానించారు. 2018లో పోలీసు ఉద్యోగం సాధించి మొదటగా నందికొట్కూరు పోలీసు స్టేషన్‌లో విధుల్లో చేరారు. 2024లో బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. వారు మాట్లాడుతూ..ఆరేళ్ల పాటు కానిస్టేబుల్‌గా విధులు సక్రమంగా నిర్వహించి మన్ననలు పొందిందన్నారు. ఏఎస్ఐ మేరిజ్యోతి, పోలీసులు శ్రీనివాసులు, రమణ, నరసింహులు పాల్గొన్నారు.



టీచర్ ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్ జ్యోతిని సన్మానిస్తున్న రూరల్ సీఐ, ఎస్ఐలు

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. నంద్యాల జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు, రిటైర్డ్ పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు వై.రామపక్కీర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.వి.భాస్కర్‌రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్‌రెడ్డి, పట్టణ ప్రముఖ వైద్యులు జగన్ ఆర్థో హాస్పిటల్ అధినేత డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. బండిఆత్మకూరు, మహానంది ఎంఈఓలు మోహన్‌రెడ్డి, విజయకుమార్, వై.శ్రీనివాసులు, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సుమయున్, హుసేన్‌సాహెబ్, చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

మహానందిలో భక్తుల సందడి

మహానంది: సెలవురోజు కావడంతో ఆదివారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. ఈ మేరకు పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని రుద్రగుండం (పెద్ద కోనేరు), రెండు చిన్న కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు ఉచిత, శీఘ్రదర్శనం ఆర్జిత సేవాటికెట్లతో పాటు అభిషేకం, మహదాశీర్వచనం సేవా టికెట్ల ద్వారా శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి యాగశాలలో ఏకాంతసేవ పూజలు జరిపారు. భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహిమాన్వితం. యాగంటి

బనగానపల్లె రూరల్: బనగానపల్లె మండలంలో ఎర్రమల పర్వతశ్రేణుల మధ్య మహిమాన్వితంగా వెలసిన యాగంటి ఉమామహేశ్వర స్వామి క్షేత్రం ప్రసిద్ధ పుణ్యస్థలంగా పేరొందింది. విజయనగర రాజులు హరహర బుక్కరాయలు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. అనంతరం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఇక్కడ సంచరించి గరిమిరెడ్డి అచ్చమ్మకు జ్ఞానబోధ చేసినట్లు ప్రాచీన కథనాలు చెబుతున్నాయి. ఇక్కడి నంది క్రమంగా పెరుగుతుండడం విశేషం. ఉమామహేశ్వర స్వామి దంపతులు విగ్రహ రూపంలో ఉన్న దేవాలయం యాగంటి. ప్రకృతి సౌందర్యంతో నిండిన ఈ క్షేత్రంలో పెద్దకొనేరు, చిన్నకొనేరు, వెంకటేశ్వరస్వామి గుహ, పెరుగుతున్న నంది విగ్రహం, ఎత్తైన గోపురాలు వంటి అనేక ఆకర్షణలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తాయి. ''నేకంటి-నేగంటి'' అనునానుడి నుంచి ''యాగంటి''గా పరిణమించిన ఈ క్షేత్రానికి ప్రతి రోజూ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాల్లో సెంట్రల్ లైటింగ్, పాతపాడు నుంచి ఆలయానికి రహదారి, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ, రైతు నిత్యాన్నదాన సంస్థల ద్వారా భక్తులకు ఉచిత భోజనం అందిస్తున్నారు.



ఏకశిలా రూపంలోఉమామహేశ్వరుడు

ఈ నెల 22 నుంచి కార్తీక మహోత్సవాలు

ఆలయంలో ఈ నెల 22 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీక మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ పాండురంగారెడ్డి తెలిపారు సోమవారం అక్టోబరు 27న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నవంబరు 3, 10, 17 తేదీల్లో వరుసగా రెండవ, మూడవ, నాల్గవ సోమవారం ఉత్సవాలు జరగనున్నాయి. నవంబరు 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్షదీపోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన శ్రీశైలం గ్రామ కమిటీ అధ్యక్షుడు పుల్లయ్య తెలిపారు.మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి శ్రీశైలం, సున్నిపెంట గ్రామ కమిటీ అధ్యక్షులను ప్రకటించారు. ఈ మేరకు శ్రీశైలం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పుల్లయ్యను ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాయల్టీని రద్దు చేయాలి

నందికొట్కూరు: నాపరాతి గనుల్లో వసూలు చేస్తున్న రాయల్టీని ప్రభుత్వం రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి కోరారు. ఆదివారం మిడుతూరు మండలంలోని నాగలూటి గ్రామంలో నాపరాతి గని కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాపరాతి గనుల్లో పని చేస్తున్న నిరుపేద కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గని కార్మికుల సమస్యను సీఎం చంద్రబాబు, ఎంపీ శబరి దృష్టికి తీసుకెళ్లి రాయల్టీ వసూలు చేయకుండా చూస్తానని చెప్పారు.

శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్ట పూజలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులకు వేదపండితుడు ఆలూరి నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రాణప్రతిష్ట చేశారు. దాతల సహకారంతో రూ.75 వేలతో ఉత్సవ విగ్రహాలను తయారు చేయించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రాణ ప్రతిష్ట చేసి సంప్రోక్షణ చేశారు. కార్తీక పౌర్ణమి రోజున ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహిస్తామని నరసింహప్రసాద్ తెలిపారు. సర్పంచ్ శివరాముడు, భక్తులు జయరాముడు, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రజల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పట్టణ పౌర సంఘాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ బాబురావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ పౌర సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీహెచ్ బాబురావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, సూపర్ సిక్స్ పథకాల అమలుపై కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో చామకాల్వ, మద్దిలేరు, కుందూనది వాగుల వెంట రక్షణ గోడను నిర్మించక పోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడ్కో ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంఘాల జిల్లా నాయకులు ఏసురత్నం, లక్ష్మణ్, నరసింహులు, వెంకటలింగం, జైలాన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన

బండి ఆత్మకూరు : మండలంలోని ఈర్నపాడు గ్రామ ప్రజలకు ఎస్ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మోసపూరిత ఫోన్ కాల్స్ గురించి వివరించారు. అనుమానిత లింకులు ఓపెన్ చేయవద్దని, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోరాదని సూచించారు. అలాగే రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా టపాసులు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సుంకాలు విధిస్తున్నా మోదీ మాట్లాడరా?



సుంకాల పుస్తకం విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: అమెరికా భారత్‌పై సుంకాలు విధిస్తున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు నోరుమెదపడం లేదని సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇండియాపై అమెరికా విధించిన సుంకాల పుస్తకాన్ని పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. అమెరికా ఇష్టానుసారంగా సుంకం విధించడం ఎంత వరకు సమంజసమన్నారు. దేశానికి నష్టం జరుగుతున్నా.. ప్రధాని మౌనంగా ఉండటం సరికాదన్నారు. ఉపాధి కోసం అమెరికాలో ఉన్నవారి వీసాలు రద్దు చేసి చేతులకు సంకెళ్లు వేసి దేశానికి పంపుతున్నా చలనం లేకపోవడం ఆయన చేతకాని తనాన్ని చాటుతుందని విమర్శించారు. అమెరికా నియంతృత్వానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నాయకులు ఫకీర్ సాహెబ్, గోపాలకృష్ణ, ఉస్మాన్, నాగన్న, గోపాల్, మాసుం పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1983-84 నుంచి 1989-90 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులు సరస్వతి, లక్ష్మిరెడ్డి, రఫిక్, బ్రహ్మచారిని ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఒకరినొకరు కుశలప్రశ్నలు కుటుంబాలను పరిచయం చేసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తీర్మానం చేశారు.

పేద ప్రజల అభ్యున్నతికి తోడ్పాటు

నంద్యాల(న్యూటౌన్): పేద ప్రజల అభ్యున్నతికి ప్రజా పర్యవేక్షణ కమిటీ తోడ్పాటునందిస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా పర్యవేక్షణ కమిటీ, ల్యాంప్ సంస్థ అధ్యక్షుడు సాల్మాన్‌పాల్, కో ఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. ఆదివారం నూనెపల్లెలోని ఆంధ్రప్రదేశ్ ప్రజా పర్యవేక్షణ కమిటీ కార్యాలయంలో జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల సమావేశం జరిగింది. సమావేశంలో సాల్మాన్‌పాల్ మాట్లాడుతూ నంద్యాలలో ఒక్కసారిగా స్వచ్ఛంద సంస్థలు ఒకే చోట హాజరు కావడం అభినందనీయమన్నారు. పేద ప్రజల అభివృద్ధి కొరకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలు సహకరించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు అధికారుల సహకారంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సామేలు, సుబ్బరాయుడు, బర్నాబాస్, మస్తాన్‌వలి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా పర్యవేక్షణ కమిటీ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం



కర్నూలు-గుంటూరు రహదారిపై సంచరిస్తున్న ఆవులు



పటేల్ సెంటర్‌లో నడిరోడ్డుపై ఆవులు

పశువుల సంచారంతో పరేషాన్

నందికొట్కూరు: పట్టణంలోని రహదారులపై పశువుల సంచారం రోజురోజుకు అధికమవుతుంది. పశువుల యజమానులు రోడ్లపైనే వదిలేస్తుండటంతో వాహనాదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. పశువులు ఒకదానిపై ఒకటి దాడికి చేసుకునే సమయంలో రోడ్లపై ప్రయాణించే వారు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్లపై పశువులను దాటుకుని వెళ్లేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో రోడ్లపై చీకట్లో గేదలు కనపడకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఆదమరిస్తే పశువులకు ఆహారం..

పట్టణంలో సంచరిస్తున్న ఆవులు, కోడేదూడలు తినుబండరాల దుకాణాలపై, తోపుడు బండ్ల వ్యాపారాలపై దాడులు చేస్తున్నాయి. రోడ్ల వెంట పండ్లు, కూరగాయాలు అమ్ముకునే వ్యాపారులు వీటి దాడికి ఇబ్బందులు పడుతున్నారు. పలువురు పట్టణవాసులు తినుబండరాలను వాహనాలపై ఉంచి ఆదమరిస్తే వాటిని ఇట్టే లాక్కెళ్లి తినేస్తున్నాయి. కాగా..పశువుల సంచారాన్ని నిరోధించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్, పోలీసు అధికారుల హామీలు ఇప్పటి వరకు నెరవేరలేదు. పశువులు రోడ్లపైకి రాకుండా చూస్తామని చెప్పినా ఆ దిశగా అడుగులు పడలేదు.